## కూలీ బంధు ఇవ్వాలి

ఎదులాపురం, జనవరి 6: వ్యవసాయంలో ప్రధానంగా ఉన్న కూలీలకు కూడా కూలీ బంధు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ దుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రధాన పాత్ర పోషించే కూలీలకు ప్రభుత్వం రూ.12 వేలు సంవత్సరానికి ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు స్వామి, ఆశన్న, పొచ్చక్క, గంగారం, రామక్క, శంకర్ పాల్గొన్నారు.

## నేరడిగొండకు తరలిన నాయకులు

తాంసి(భీంపూర్), జనవరి 6: ఎమ్మెల్సీ కవిత పర్యటన నేపథ్యంలో భీంపూర్ మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు నేరడిగొండకు తరలివెళ్లారు. ఎమ్మెల్సీ కవిత సహా ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి స్థానిక సమస్యలు విన్నవించుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు నరేందర్, మడావి లింబాజీ, సంతోష్, గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

## గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

బోథ్, జనవరి 6: మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే కొనసాగుతోంది. 33 గ్రామ పంచాయతీల పరిధిలో 13,056 మంది లబ్ధిదారులు ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం వరకు 11,850 ఇండ్ల సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. 33 జీపీల పరిధిలో 51 మంది సర్వేయర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేపడుతున్నారు. దరఖాస్తుదారుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వేను ఎంపీడీవోతో పాటు ఎంపీవో అతుల్ కుమార్ పరిశీలించారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఎదులాపురం, జనవరి 6: మావలలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్లు, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్, అలాగే ట్రాన్స్ జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్, ఆదిలాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. అలాగే మావల మండలం దుబ్బాగూడలో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, ఆర్డీవో వినోద్ కుమార్, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, నాయకులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం

ఎదులాపురం, జనవరి 6: మావల మండల పరిధిలోని పద్మనాయక్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి సభాధ్యక్షతన సోమవారం పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో అవలంబించాల్సిన వ్యూహాలను సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్, మాజీ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, విఠల్ రెడ్డి, రాథోడ్ బాపురావ్, అజ్మీరా రేఖానాయక్, నారాయణ రావు పటేల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, డీసీసీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

జైనథ్, జనవరి 6: బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని మనస్థాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జైనథ్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిప్పరవాడ గ్రామానికి చెందిన అలిశెట్టి సాయి(23) అభ్యుదయ హాస్టల్‌లో కిచెన్ సహాయకుడిగా పని చేస్తున్నాడు. బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్నాడు. సోమవారం ఉదయం అభ్యుదయ పాఠశాల ఆవణలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

## డీఎస్సీలో ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి

ఎదులాపురం, జనవరి 6: ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో పూర్తి స్థాయిలో ఖాళీలను భర్తీ చేయాలని డీఎడ్ బీఎడ్ నిరుద్యోగులు సోమవారం ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ నిరుద్యోగులు ప్రదీప్, దత్తు, విజయ్, రవికిరణ్, అనిల్, గణపతి, శివుడు, సాయి, రాజు, విశాల్ పాల్గొన్నారు.

## ఫ్లెక్సీ వార్



చింపివేసిన ఫ్లెక్సీలు

ఎదులాపురం, జనవరి 6: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ ఫ్లెక్సీల చించివేత వివాదం నెలకొన్నది. మావలలో కాంగ్రెస్ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశానికి రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రావడంతో పార్టీ శ్రేణులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. అయితే పార్టీలోని వర్గ విభేదాలతో ఒకరు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మరొకరు చింపివేశారని ఆరోపించుకున్నారు. కీలక సమయంలో విభేదాలు బయటపడడం చర్చనీయాంశంగా మారింది.

## అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

భైంసా, జనవరి 6 : నిర్మల్ జిల్లా భైంసాలోని అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలిపారు. ముందుగా అమ్మవారి చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేశారు.

# రైతు భరోసాపై మాట తప్పిన సర్కారు

- రైతులకు మద్దతుగా బీఆర్ఎస్
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో నిరసనలు



ఇంద్రవెల్లి: రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్, జనవరి 6: రైతు భరోసాపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో నిరసన తెలిపిన రైతులకు బీఆర్ఎస్ మద్దతుగా నిలిచింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిరసనలు చేపట్టారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద నాయకులు, రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు రూ. 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎగ్గొట్టిన సర్కారుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన సమాధానం చెబుతామని హెచ్చరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు గౌరికర్ రాజు, రాజగంగన్న, పార్టీ శ్రేణులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పెంబి, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు భరోసాపై ఇచ్చిన మాట మేరకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ జిల్లా పెంబిలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎన్నికల ముందు అందజేసిన ఆరుగ్యారెంటీల అమలు పత్రాలు దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాండ్ల శంకర్, మహేందర్, మల్లేశ్, విలాస్, ఇస్మాయిల్, నరేందర్, చిన్నయ్య పాల్గొన్నారు.



ఖానాపూర్: నిరసన తెలుపుతూ...

నేరడిగొండ, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని మోసం చేస్తోందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి రైతు భరోసాపై మాటమార్చిన విషయమై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదేశాల మేరకు నేరడిగొండలోని ప్రధాన కూడలి వద్ద పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి రూ.12వేలు రైతు భరోసా తగ్గించడం పై మండిపడ్డారు. అన్నదాతలను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి త్వరలో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, నాయకులు రాథోడ్ సురేందర్, మదన్‌సింగ్, కరణ్‌సింగ్, జాదవ్ పవన్, గులాబ్‌సింగ్, నారాయణ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జనవరి 6: రైతు భరోసా విషయంలో మాట తప్పి కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు పుర్కా బాపురావ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నాయకులు రోడ్డుపై బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వరంగల్ సభలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డిక్లరేషన్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏటా రైతులకు ఎకరానికి రూ 15వేలు ఇస్తామని ఏడాది పాటు ఊరించి చివరకు రూ.12వేలు ఇస్తామని మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్‌డోంగ్రే, మండల కోఆర్డినేటర్ షేక్ సుఫియాన్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, మాజీ ఎంపీటీసీ మడావి భీంరావ్, నాయకులు మిర్జా జిలానీబేగ్, రాంనివాస్, సుఫియాన్, శ్రీనివాస్, ప్రకాశ్. వసంత్‌రావ్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

సోన్, జనవరి 6: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను నిర్మల్ వద్ద బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి నాయకులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో కొనసాగుతున్న నిరసనలపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవెర్చక ప్రశ్నించేవారిపై అక్రమ కేసులతో భయపెడుతున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. ఇక్కడ జిల్లాలోని పలు మండలాల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



సోన్: ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్మల్ బీఆర్ఎస్ నాయకులు

### ఎమ్మెల్సీ కవితను కలిసిన మాజీ సర్పంచ్‌లు, నాయకులు

తాంసి, జనవరి 6: మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ మండల మాజీ కన్వీనర్ మాజీ సర్పంచ్ కృష్ణ రత్న ప్రకాశ్ విన్నవించారు. సోమవారం నేరడిగొండ మండలంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ స్వగృహంలో ఎమ్మెల్సీ కవితను మండల నాయకులు కార్యకర్తలతో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల సమస్యపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు వినోద్ రెడ్డి, మహేందర్, రఘు, భరత్ ఉన్నారు.

ఇచ్చోడ, జనవరి 6: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేరడిగొండలోని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ నివాసానికి రాగా ఇచ్చోడ బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్, ముక్రా(కే) మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ఉట్నూర్ రూరల్, జనవరి 6: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ మార్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు జరిగిన మేలును గుర్తు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడాలని సూచించినట్లు పేర్కొన్నారు.



ఇచ్చోడ: ఎమ్మెల్సీ కవితతో నాయకులు



ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్సీ కవితకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ధరణి రాజేశ్

## ఆరు గ్యారెంటీలు అమలయ్యే దాక వదలం..



ఎమ్మెల్సీ కవితకు బొట్టుపెట్టి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సతీమణి హరిప్రియ

నేరడిగొండ, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేదాక వదిలేది లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సోమవారం ఆసిఫాబాద్‌కు వెళ్తూ నేరడిగొండలో పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అబద్ధాలు, మోసం చేసే పార్టీ అని ప్రజలకు స్పష్టమైందని అన్నారు. ఆ పార్టీ ముఖ్యమంత్రి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళ్తున్న నాయకుడు జాదవ్ అనిల్ అని కొనియాడారు. ముందుగా నేరడిగొండలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, మండలాల కన్వీనర్లు శివారెడ్డి, నారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, జనవరి 6: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని బహుజన లెఫ్ట్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్మల్ కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకు పింఛన్ అమలు చేయాలని, పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఉట్నూర్ రూరల్, జనవరి 6 : ఏందా గ్రామానికి చెందిన రవీందర్(42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం రవీందర్ కిరాణ దుకాణం నడుపుతూ ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. మనోహర్ భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిస అయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వారి పిల్లలు అనాథలుగా మారారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రజలు పోలీసు సేవలను వినియోగించుకోవాలి

నిర్మల్ అర్బన్, జనవరి 6: నిర్మల్ జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం నిర్మల్‌లోని పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, జనవరి 6: ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన అనంతపేట్ గ్రామస్తులు

సోన్, జనవరి 6 : అనంతపేట్ గ్రామంలో రెండు నెలలుగా పారిశుధ్య పనులు చేపట్టడం లేదని గ్రామస్తులు కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి విన్నవించారు. మల్టీపర్పస్ వర్కర్లు విధులు నిర్వహించకపోవడంతో గ్రామంలోని ప్రధాన కూడళ్లతో పాటు డ్రైనేజీల్లో చెత్త పెరుకుపోయి గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారని వివరించారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్, జనవరి 6: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని పీవో క్యాంప్ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. నిర్మల్ మండలం ముజిలి గ్రామానికి చెందిన ముత్యం బర్రెల పెంపుదలకు లోన్ మంజూరు చేయాలని, సిర్పూర్(యూ) మండలం రాగాపూర్ గ్రామానికి చెందిన లింగబాయి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా ఇప్పించాలని, ముజిలి గ్రామానికి చెందిన గంగవ్వ కిరాణ దుకాణానికి లోన్ మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావ్, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ ఉమాదేవి, మేనేజర్ లింగు, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, వివిద శాఖల పాల్గొన్నారు.

## పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ

నిర్మల్ అర్బన్, జనవరి 6: నిర్మల్‌లోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ క్వాటర్స్ నూతన భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావు రాంనాథ్, సత్యనారాయణ, రాజు, నరేందర్, శంకర్, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి కృషి చేయాలి



మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ముకాడే ఉత్తమ్, పక్కన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఇంద్రవెల్లి, జనవరి 6: రైతుల అభివృద్ధికి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ఇంద్రవెల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముకాడే ఉత్తమ్‌తోపాటు వైస్ చైర్మన్ సోయం మారుతితోపాటు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముకాడే ఉత్తమ్ ఎమ్మెల్యే సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఆదివాసీ సంఘాల నాయకులతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఏఎంసీ కార్యదర్శి దేవన్న, నాయకులు పాల్గొన్నారు.

## లంబాడీ హక్కుల సాధనకు సమష్టిగా కృషి చేయాలి

బేల, జనవరి 6: లంబాడీ హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని బంజారా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీంరావ్ నాయక్, బంజారా జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని సైద్‌పూర్ గ్రామంలో అఖిల భారతీయ బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారతీయ బంజారా సేవా సంఘం మండలాధ్యక్షుడు రాథోడ్ రోహిదాస్, ఆయా గ్రామాల లంబాడా నాయకులు పాల్గొన్నారు.

## అర్బన్ పార్కులో కోతులకు నియంత్రణ ఆపరేషన్లు

సారంగాపూర్, జనవరి 6 : చించోలి(బి) గండిరామన్న అర్బన్ పార్కులో సోమవారం కోతుల పునరావాస, పునరుత్పత్తి నిరోధక కేంద్రంలో కోతుల నియంత్రణ ఆపరేషన్లను ప్రారంభించారు. బాసర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ సర్కిల్ శరవానన్, జిల్లా అటవీశాఖ అధికారి ఆదం నాగిని, అటవీక్షేత్ర అధికారి రామకృష్ణారావు ఆదేశాల ప్రకారం నిర్మల్‌లోని సుమారు 90 కోతులకు పట్టించి డాక్టర్ శ్రీకర్‌రాజు, పశువైద్యాధికారి, సిబ్బంది కలిసి కోతులకు స్టాండర్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం విసెక్టమీ, ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేశారు. ప్రజలు, వీడీసీ సభ్యులు కోతుల బెడద ఎక్కువగా ఉన్న చోట నుంచి కోతులను ఎంఆర్సీ కేంద్రానికి తీసుకొస్తే నియంత్రణ ఆపరేషన్లు చేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఫార్మసీ విద్యార్థి మృతి

నర్సంపేట, జనవరి 6 : విద్యుదాఘాతంతో ఫార్మసీ విద్యార్థి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట–నెక్కొండ ప్రధాన రహదారిలోని ముగ్ధుంపురం గ్రామ శివారులోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో సోమవారం చోటు చేసుకుంది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఈల్వీ గ్రామానికి చెందిన రైతు కొండల్‌వాడి దత్తారెడ్డి–లక్ష్మి దంపతుల కుమారుడు అవినాశ్‌రెడ్డి(18) ముగ్ధుంపురం గ్రామ శివారు జయముఖి ఫార్మసీ కళాశాలలో ఫార్మా–డీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇదే కళాశాల ఎదుట గల ప్రైవేట్ బాలుర హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు. నర్సంపేటకు చెందిన వెలుగు వివేక్ ఈ హాస్టల్‌ను నడుపుతున్నాడు. హాస్టల్‌లో మోటర్ రిపేర్‌కు రావడంతో వార్డెన్ సూచన మేరకు అవినాశ్‌రెడ్డి పైపు పట్టుకొని నీటితో మోటర్ లెవల్ పోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అవినాశ్‌రెడ్డిని వార్డెన్ స్కూటీపై ఎక్కించుకొని ముగ్ధుంపురంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడి నుంచి నర్సంపేటలోని ప్రభు త్వ జనరల్ దవాఖానకు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించగా అవినాశ్‌రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

## ఒప్పంద జీవోను విడుదల చేయాలి




ఎదులాపురం: ధర్నా చేస్తునన సివిల్ సప్లయ్ కార్మికులు

ఎదులాపురం, జనవరి 6 : సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు పెంచిన ఒప్పంద జీవోను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని హమాలీ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ గతంలో సివిల్ సప్లయ్ కమిషనర్ కార్మికులతో, కార్మిక సంఘాల నాయకులతో ఒప్పుకున్న ప్రకారం జీవో అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజు, హమాలీ యూనియన్ నాయకులు సలీం, మోసిన్, రాజేందర్, రమేశ్, పొచ్చన్న పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, జనవరి 6: సివిల్ సప్లయ్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్మల్ కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భగా ఏఐటీయూసీ నాయకుడు విలాస్ మాట్లాడుతూ హమాలీల కూలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.





నిర్మల్ : కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న హమాలీలు

## ఏసీబీ డీఎస్పీగా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

ఎదులాపురం, జనవరి 6 : ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీగా పి.విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చి ఆయన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీగా ఉన్న రమణమూర్తి ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైన లంచం అడిగితే నేరుగా తనకు ఫోన్ 9154388963 నంబర్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలన్నారు.

## విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 6: విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి అన్నారు. నిర్మల్‌లోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత ఒలింపియాడ్ టెస్ట్‌లో రాణించిన విద్యార్థులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామానుజన్ చేసిన సేవలను కొనియాడారు. అనంతనం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు.

## రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

కుభీర్, జనవరి 6: రైతాంగాన్ని మోసపూరిత మాటలతో నమ్మించి రేవంత్‌రెడ్డి సర్కారు మోసం చేసిందని మండల గిరిజన నాయకుడు పండిత్ జాదవ్ అన్నారు. సోమవారం కుభీర్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి పగ్గాలు చేపట్టాలన్న దురాశతో ఇబ్బడిముబ్బడిగా అమలు కాని హామీలు ఇచ్చి ఇప్పుడు చేతగాక రైతుభరోసాలో కోతలతో పాటు ప్రతి పథకాన్ని కాలరాసే పన్నాగం చేస్తోందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. గత ప్రభుత్వంలోని ఏ పథకాన్ని సక్రమంగా కొనసాగించిన దాఖలాలు లేకపోవడం వారి పరిపాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.

## ట్రాక్టర్ ఢీ కొని ఒకరి మృతి

సోన్, జనవరి 6: నిర్మల్ జిల్లా సోన్ మండలం పాక్‌పట్ల గ్రామానికి చెందిన మహ్మద్ ఖాసీం(52)ను ట్రాక్టర్ ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సోన్ గ్రామం నుంచి మాదాపూర్ పెట్రోల్ బంక్‌వైపు వెళ్తున్న ట్రాక్టర్ అతి వేగంగా అజాగ్రత్తగా నడిపి నడుచుకుంటూ వెళ్తున్న మహ్మద్ ఖాసీంను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ దవాఖానకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇసుక రవాణాపై ఎస్పీకి ఫిర్యాదు

తాంసి(భీంపూర్), జనవరి 6: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని వడూర్ పెన్‌గంగ నుంచి కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని సోమవారం వడూర్ గ్రామస్తులు ఎస్పీ గౌష్ ఆలంకు విన్నవించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రమణరెడ్డి, రాహుల్, శ్రీనివాస్ ఉన్నారు.

## యువకుడి అదృశ్యం

ఎదులాపురం, జనవరి 6: ఆదిలాబాద్‌లోని బ్రాహ్మణవాడకు చెందిన గుగ్గిళ్ల రవి (23) అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. రవి ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన గురయ్యారు. ఇరుగు పొరుగు చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. తండ్రి గుగ్గిళ్ల నర్సింగ్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ తెలిపారు.

## తలమడుగు పీఏసీఎస్‌లో చోరీ

తలమడుగు, జనవరి 6 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చోరీ జరిగింది. ఆదివారం సైతం సొసైటీ సిబ్బంది స్థానిక రైతులకు ఎరువులు విక్రయించారు. ఆ వచ్చిన డబ్బుల్లో రూ.42వేల నగదును సిబ్బంది కార్యాలయంలోని లాకర్‌లో పెట్టి వెళ్లారు. సిబ్బంది సోమవారం ఉదయం సొసైటీకి వచ్చి చూసే సరికి గది తాళాలు పగుల గొట్టి కనిపించాయి. దొంగలు లాకర్‌లో నుంచి రూ.42 వేలు అపహరించారు. దీంతో సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ కార్యాలయంలో ఎలాంటి సీసీ కెమెరాలు లేవు. అలాగే సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అయితే ఇవన్నీ గమనించే దుండగులు చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు.